# సీతయ్య

జ్ఞాపకాల పొరల్లో దాగున్న దుబ్బాక రోజులు నెమరుకొస్తే నా మనసు మయూరమై నర్తిస్తుంది. దుబ్బాక... అమ్మమ్మ మెట్టిన ఊరు, మా అమ్మ పుట్టి పెరిగిన ఊరు.

పొట్టి నెక్కరు ప్రాయములో నా ఊహల రెక్కలు తొడుక్కుందక్కడి ఆటలోనే. స్కూలుకు సెలవులు ప్రకటించగానే బస్సెక్కి దుబ్బాకలో వాలేవాణ్ణి. దుబ్బాక-లచ్చపేట జంట గ్రామాలు. రెంటికిమధ్య పొడగాటి చెరువుకట్ట వారధిలాగుంటుంది. నిండా నీటితో - చెరువు నిండు చూలాలులా కనబడేది. నీటిమీద కలువలు, కమలాలు గాలితో సయ్యాట లాడుతుండే - పిల్లలము చెరువులో ఈదులాడుతూ దాగుడుమూతలాడుకునే వాళ్లం. చెరువుకట్ట కటువైపు పొలాలు, పొలాల అంచున ఏపుగా పెరిగిన చెట్లు సంతోషంగా తలలాడిస్తుంటే చూడముచ్చటగా ఉండేది.

నాకంటే రెండేళ్ల ముందు ఈ లోకానికొచ్చిన లోకేశం మావయ్య నేస్తాలతో చెరువు కట్టమీద చెడుగుడు ఆడుకుంటుంటే, సూర్యగమనం తెలిసేది కాదు. మీట్టమధ్యాహ్నం తాతయ్య - పోలిసు జవానులా వచ్చి "మీకోసం గుత్తివంకాయ కూర, అరటికాయ బజ్జీలు, గడ్డపెరుగు కాచుకూచ్చున్నాయి. పదండిరా!" అంటూ తియ్యని మాటల్తో తీసుకెళ్లేవాడు.

కాలేజి చదువు, ఉద్యోగం, పెళ్లి, సంసారం... అటువైపు వెళ్లనివ్వలేదు. చాలాకాలం తర్వాత దుబ్బాక వెళ్లాల్సివచ్చింది. ఆనాడది పచ్చి పల్లెటూరు, నేడు మండలకేంద్రము. ఆధునికత సంతరించు కుంటుందని విన్నాను. గుండెలమీద ఆడిస్తూ, గోరు ముద్దలు తినిపించిన అమ్మమ్మ అవతారం చాలించిందట. వరంగల్లులో ఆఫీసరుగా వెలిగిపోతున్న లోకేశం మావయ్య - హైదరాబాదులో యాంత్రికంగా జీవిస్తున్న నాకు సెల్‌ఫోన్‌లో చెప్పాడు. "నేను ఇట్నుంచి మీ అత్తయ్యను తీసుకొస్తాను. నువ్వట్నుంచి మా అక్కయ్యను తీసుకురమ్మ"ని.

ఎన్నిసార్లు ప్రయత్నించినా అమ్మమ్మ ఆ ఊరు విడిచి రానన్నది. తనతో ఉండుమని మావయ్య ఎంత బతిమాలినా ససేమిరా అంది. మా అమ్మాయి పెళ్లికా మధ్య హైద్రాబాదు కొచ్చినప్పుడు నేను గూడా చెప్పిచూశాను. అమ్మమ్మ మొహం అల్లనేరేడు పండులా మారింది. శూన్యంలోకి చూపులు సారించి

"ఒరేయ్! పదిహేనేళ్ల వయసులో మీ తాతయ్య వేలు పట్టుకుని పల్లకీలో ఆ ఊరికొచ్చాను. చచ్చిస్వర్గాన ఉన్న నా భర్త ఊరే నా ఊరు. దుబ్బాక పరిసరాలతో పెనవేసుకున్న ఆత్మీయబంధాన్ని తెంచుకోలేనురా. లంకంత ఇల్లుంది. బోలెడు పొలముంది. నన్నే నమ్ముకున్న పాలేరున్నాడు. అయినా.... నాకేదన్నా అయితే మీరున్నారు. టెలీఫోనుంది గదరా!" అంటూంటే కళ్లను మంచుతెరలు కమ్ముకున్నాయి.



ఐతా చంద్రయ్య

"అదికాదే అమ్మమ్మా! అసలా..." సముదాయించబోయాను.

"ఒరేయ్ వెర్రినాగన్నా!" గొంతు వణికింది. "మెట్టిన ఊరును తిండి పెట్టిన పొలాన్ని, కష్టసుఖాల్లో పాలుపంచుకున్న జనాలను శాశ్వతంగా వదులుకో లేనురా. ఉద్యోగాల్లో ఉన్న మీ సంగతి వేరు. మీరంతా సుఖంగా ఉంటే నాకదే చాలు."

ఆ మొండి ఘటాన్ని మెప్పించి ఒప్పించడము అసాధ్యమని తేలింది... అమ్మమ్మ జ్ఞాపకాలు మెదడు పొరల్లో మెదులుతూంటే దుబ్బాకలో బస్సుదిగాను. బస్టాండు బాగానే కట్టారు. ఎండాకాలం. మనిషికీ, మనిషికీ మధ్యన మాయదారి ద్వేషంలా చిటపటలాడుతోంది ఎండ. అమ్మ నా వెనుక నడుస్తోంది. "అమ్మో! పదింటికే నిప్పులు చెరుగుతోంది ఎండ" గొణుగుతూ కొంగును నెత్తిమీదేసు కుంది. తోసుకొస్తున్న దుః ఖాన్ని గొంతులో అదిమిపెట్టిందేమో, కళ్లల్లో నీళ్లూరు తున్నాయి. అడుగులు తడబడుతున్నాయి.

ఆపద సమయములో అపసోపాలు పడుతూ నడవడం కంటే రిక్షానా శ్రయించడమే నయమన్పించింది. పదవిలో ఉన్న రాజకీయ నాయకుడి ఆస్తుల్లా పెరిగిపోయిన బంగళాలను చూస్తూ "ఊరు చాలా మారిపోయిందే!" అన్నాను రిక్షా ఎక్కుతూ.

"ఆc.... ఏం మార్పు సార్!" రిక్షావాలా అందుకున్నాడు. "జనాలు పెరిగిపోతున్నరు. నీళ్లు కరువైపోతున్నయి. అసలూ... భూమిల నీళ్లు గంతలోతు కెందుకు పోతున్నయి సారూ?"

"అంటే....!"

"గదే సార్!" శక్తినంతా కూడదీసుకుని రిక్షాను పరిగెత్తిస్తున్నాడు. "ఐదేండ్ల కింద నూరు ఫీట్ల బోరు బోలెడన్ని నీళ్లిచ్చేది. ఇపుడు నాలుగొందల ఫీట్లు బోరేసినా లాభంలేదు." తువ్వాలుతో మొహమ్మీది చెమట అద్దుకున్నాడు. అతనికి సమాధానం చెప్పే మూడ్‌లో లేను.

ఇల్లు వచ్చేసింది. ఇంటిముందు షామియానా వేసుంది. జిడ్డు మొహాలను చేతిగుడ్డల్తో అద్దుకుంటూ రిక్షా దిగాము. కుర్చీల్లో ఎవరెవరో ఉన్నారు. అమ్మమ్మ యశోగానము ఆనోటా, ఆనోటా వివబడుతోంది. గడప దాటానో లేదో.

"మా అమ్మ చచ్చిపోయిందిరా!" లోకేశం మావయ్యా నా మీదవాలి గొల్లుమన్నాడు. ఇంతసేపు దుఃఖన్నెలా ఆపుకుందో అమ్మ - బోర్‌మని శవమ్మీద వాలిపోయింది. "మనం తల్లిలేని వాళ్లమయ్యాము రా తమ్ముడూ" అంటూ మామయ్య చేతులందుకుంది. "అవునే అక్కయ్యా" అంటూ మావయ్య శృతి కలిపాడు.

ఇల్లు శోకవనములా మారింది, శవమైన అమ్మమ్మను చూస్తుంటే గుండెనరాలను మెలిపెట్టి నట్టైంది. అర్నెల్ల క్రితం మా ఇంటికొచ్చింది. శారీరక అస్వస్తతను మనసుకు పరిమితంచేసి నోటితో చెప్పలేని బాధను కళ్లతో వ్యక్తం చేస్తూ బోసి నవ్వులతో బస్సెక్కింది.

"ఊరు దూరమైంది. కాడు దగ్గరైంది" అనుకున్న జ్ఞాని వాలకం అలాగే ఉంటుందేమో! కనిపించని మనసుకు చూపు ఉంటుంది. కనిపించే కొన్ని కళ్లకు చూపు ఉండదు. దృశ్యం... అంతరంగాన్ని అల్లకల్లోల సముద్రంలా మార్చేసింది. ఆ సముద్ర తరంగాలు ఉవ్వెత్తున లేచి కళ్ల ద్వారా బయటి కొస్తున్నాయి.

"బాబూ!" అమ్మమ్మనూ, పొలాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న పాలేరు సీతయ్య చేతులు కట్టుకుని నాముందు నుంచున్నాడు. "అన్నీ తెలసిన మీరు గూడా గట్లయిపోతే ఎట్లా? జానకమ్మ ధర్మాత్మురాలు. కుక్కి మంచముల పడలేదు. ఎవ్వరితోనూ చాకిరి చేయించుకోలేదు."

ఆత్మీయుల మరణం మనసులో అంతర్లీన మైన అష్టమ సముద్రాన్ని పొంగించి, రాతిగుండెల్ని గూడా కరిగిస్తూ కన్నీటి ప్రవాహమై బయటపడుతుంది. ప్రవాహవేగాన్ని నియంత్రించే ప్రయత్నం చేస్తూ "కానీ...ఏ రోగమూ లేకుండా, అమ్మమ్మ ఎట్లా చనిపోయింది సీతయ్యా?" అడిగాను.

"సాయంత్రం జానకమ్మ బయట కనబడలేదు. ఇల్లంతా దేవులాడిన. దేవునింట్ల ఆయమ్మ కాళ్లూ చేతులు ఒడ్డుకేసిన చేపపిల్లలోలె కొట్టుకుంటున్నె. "ఏమైందమ్మా?" అని దగ్గరికి వోయిన.

"ఏమో సీతయ్యా! ఛాతీమీద సుత్తిదెబ్బలు పడ్డట్టుంది' అని ఛాతీ పుణుక్కుంది. నేను పరేషానైపోయిన. ఆయమ్మ దేవుడికి దండం బెట్టింది. 'ఇంగ నేను వోతున్న సీతయ్యా' అన్నది. అదే ఆఖరు మాటనయ్యా." పచ్చికుండ పగిలినట్టు భళ్లున ఏడుపందుకున్నాడు. ఆ దుఃఖ ప్రవాహాన్నాపడం నా తరమా! సీతయ్యను గుండెలకు హత్తుకున్నాను. జీవన యానంలో ఆశల ఆరాటానికి, ఆశయాల పోరాటానికి సమన్వయం కుదుర్చలేని మా జీవితాలు వేరు, నా అన్న వారెవ్వరూ లేక అమ్మమ్మనే నమ్ముకుని కాయకష్టం చేస్తూ ఆమె కనుసన్నలలో బతుకుతున్న ఈ అమాయకుని జీవితం వేరు.

ఏడ్పులూ - ఓదార్పులూ, గుసగుసలూ - రుసరుసలూ... ఇవన్నీ మామూలే. అమ్మమ్మ అంతిమ యాత్రకు సీతయ్యనే పెద్ద దిక్కు. అప్పటికే అన్ని ఏర్పాట్లూ చేశాడు. సమయానికి నేలమీద పడున్నాడు.

"అమ్మా! ఒక్కసారి కళ్లు తెరువమ్మా. మాకు గోరుముద్దలు తినిపించ మ్మా..." అంటూ అమ్మ గుండెలు బాదుకుంటోంది. అత్తయ్య అమ్మ నోదార్చుతోంది.

నేనూ, మావయ్య చెరో రెక్క పట్టుకుని సీతయ్యను కూచోబెట్టాము. అనునయ వాక్యాలతో ఊరడించాము.

"సీతయ్యా! మాకిక్కడ నువ్వే పెద్ద దిక్కుగదా!" మావయ్య అతని చేతులందుకుని బతిమాలాడు. శవాన్ని మోసేందుకు నలుగురు మనుషులు కావాలి గదా! అందుకే అన్నారు 'నలుగురితో కలిసి ఉండు - నాలుగు మంచి పనులు చెయ్'మని కాని... ఆశ్చర్యం... అల్పజ్ఞాని అహంకారములా మండిపోతున్న ఎండను లెక్కచెయ్యకుండా శవాన్ని మోసేందుకు ఎందరో ముందుకొచ్చి నేనంటే నేనని పోటీపడ్డారు.

తరాల నుంచి సంక్రమించిన స్థిరాస్తి పొలం. ఆ పొలములోనే ఆవిడ చితిమంటలు ఆకాశాన్నంటాయి. ఊరివాళ్లంతా తలా ఓ కట్టెపుల్ల చితిలో వేసి వెనుదిరిగారు. మేమే మిగిలాము. చితిమంటల్ని చూస్తూ సీతయ్య గుండెలు బాదుకుంటూ అమ్మా, తల్లీ అంటూ లబలబలాడ్తున్నాడు. ఆతడూ నావయసు వాడే. అమ్మమ్మను, భూమాతను నమ్ముకుని జీవిస్తున్నాడు. మా అమ్మ, అత్తయ్య ఓ పక్కన కూచుండి అంతాచూస్తున్నారు. అప్పటికే చాలా పొద్దుపోయింది.

"జరిగిందేదో జరిగింది. జరగాల్సింది చూడాలి గదా సీతయ్యా" సముదాయింపుకు దిగాను. "అమ్మమ్మ ఏం చేసిందో, ఎట్లా ఉండేదో మాకంటే నీకే బాగా తెలుసు.. నువ్విట్లా ఏడుస్తూ కూచుంటే ఆమె ఆత్మ శాంతిస్తుందా?"

ఏడుపు ఆగిపోయింది. కపాలమోక్షం జరిగింది.

ఒక్కోసారి బతుక్కంటే చావే గొప్పదిగా కల్పిస్తుంది. ఆశ నిరాశకు, రాగద్వేషాలకు దూరంగా తీసుకెళ్లి శాశ్వత విశ్రాంతినిస్తుంది.

"ఏదో బాబూ!" తాను కదుల్తూ మమ్మల్నీ కదులుమని పైగ చేశాడు సీతయ్య "జానకమ్మ నన్ను కన్నకొడుకోలె చూసుకుందయ్యా. ఇంగ నా గతేందో... ఏమో!" చేతులు గాల్లో కెత్తి మొక్కుతూ పక్కనున్న చెట్టుకిందికి తీసుకెళ్లాడు.

చెట్టునీడ చల్లగా, కన్నతల్లి ఒడి లాగుంది. గాలి లేక చెట్టు మౌన తపస్విలాగుంది.

"మనమిపుడు స్నానాలు చెయ్యాలిగదా!" అమ్మ గుర్తు చేసింది.

ఎటో చూస్తున్న సీతయ్య "అదే... నీళ్లెక్కడ దొరుకుతయా అని... ఆలోచిస్తున్నా" ధోవతి మలిచి నడుముకు బిగించుకున్నాడు.

నిజమే. నీటి కరువు భయంకరంగా ఉంది. శవయాత్ర చెరువుకట్టమీది నుంచే సాగింది. అంతపెద్ద చెరువులో నీటిచుక్క లేదు. "మరెట్లా సీతయ్యా!" బరువెక్కిన గుండెతో అడిగాను.

"మరీ... ఆ పొలములో పంట ఎట్లా పండింది సీతయ్యా!" కనుచూపుమేర కలియజూస్తూ లాజిక్‌పాయింట్ లాగాడు మావయ్య. అత్తయ్య, అమ్మ ఆశగా చూస్తున్నారు.

"జానకమ్మ అక్కడ బోరు వేయించింది. కరెంటు మోటరుంది." మా వెనుకున్న చిన్న పెంకుటిల్లు చూపించాడు.

"కానీ... మొన్న అటు పంట కోతకొచ్చింది. ఇటు బోరు బోర్లపడింది. నీటిచుక్క గూడా వస్తలేదు." చేతులు పిసుక్కుంటున్నాడు. ఇంతబతుకూ బతికి ఇంటెనక చచ్చినట్టు – శవాన్ని మోసుకొచ్చి స్నానం చెయ్యకుండా వెళ్లాలా!

"ఇప్పుడెట్లా మరి" మావయ్య గూడా చేతులు పిసుక్కుంటున్నాడు. మోహం ముడుచుకుపోయింది. నుదుటినిండా చెమట బిందువులు మురుస్తున్నాయి. గాలికెరటం చెట్టుకొమ్మలనదిలించింది. వేడిగాలి... తడికోసం తహతహలాడ్తున్న శరీరాలను మరింత మండించింది. వేపకొమ్మలవైపు కోపంగా చూశాను. నాకే తపోశక్తి ఉంటే కొమ్మలు, రెమ్మలు భగ్గున మండి పోయేవేమో!

గాలీ, వాన, ఎండ, చలి... దేన్నైనా తట్టుకునే శక్తి చెట్టుకుంది. కాని మనిషో! పంచభూతాల్లో దేనికోప్పమెచ్చినా దాసోహమనక తప్పదు. సీతయ్య నావైపు ఎగాదిగా చూస్తున్నాడు. అతడొక్కడే ఆత్మబంధువులా కన్పించాడు.

"ఏమి చేస్తవో చెయ్ కాని... స్నానాలకు నీళ్లు తెప్పించే బాధ్యత నీదే సీతయ్యా!" తెగేసి చెప్పేశాను.

సీతయ్య కళ్లు ఖాళీగుంటల్లాగైనాయి. దృక్కులు నాలుగు వైపులా ప్రసరించాయి. ఖాళీ సైకిల్ ట్యూబులోకి గాలి ఎక్కించినట్టు - ఒక్కసారే నిటారుగా నుంచున్నాడు. సూర్యకిరణాలు కళ్లమీద పడకుండా ఎడమ అరచేతిని కనుబొమ్మల మీదుంచుకుని "గోపీ.... అరేయ్ గోపీ!" గట్టిగా కేకేశాడు. ఫర్లాంగు దూరంలోంచి పదేళ్ల కుర్రాడు "ఏంది తాతా!" అంటూ పరుగెత్తుకొచ్చాడు. కాళ్లకు చెప్పుల్లేవు. కళ్లు మిలమిలా మెరుస్తున్నాయి. పొట్టి నెక్కరు, పొడగాటి ముక్కు మొండి బనీను, చెమటతో తడిసిన మెడ...

"ఇట్లా నీడకు రా. కాళ్లు కాలడంలేదా?" మావయ్య అడిగాడు.

"ఇది నాకలవాటే సారూ." నవ్వేశాడు గోపి. ఆ నవ్వు పెద్ద బాలశిక్ష పాఠం లాగుంది.

"వీడు మన పక్కూరోడు బాబూ!" గోపిని మాకు పరిచయం చేశాడు సీతయ్య. అటువైపు తిరిగి "అర్జంటుగా రెండు కావడుల నీళ్లు కావాలి. దొరకవంటే కుదరదురా!" అడిగాడు బుర్ర గోక్కుంటూ. కాష్టంవైపు చూశాడు గోపి.

"కావడికి ఇరవై రూపాయలు. నాల్గు కుండల నీళ్లకు నలభై ఇస్తారురా!" ఆశజూపాడు సీతయ్య "పాపం! తండ్రి లేనోడు వీళ్లమ్మా, వీడు ఎక్కడెక్కడి నుండో నీళ్లు మోసుకొచ్చి అమ్ముకుని పొట్టబోసుకుంటారయ్యా" అన్నాడు మాతో.

"నాలుగు కుండల నీళ్లకు యాభయిస్తా" మావయ్య రేటు పెంచేశాడు. అవసరం అలాంటిది. మరీ ఆత్రంగా అటూ, ఇటూ చూస్తున్న గోపి "సరే సార్" అన్నాడు హుషారుగా. "కానీ.. మా అమ్మ లేదు. నీళ్లకోసం ఎటో పోయింది. రెండు కావడులు నేను మోయలేను!" వాని మొహం ప్రశ్నార్థకమైంది.

"నేనొస్తా పదరా!" సీతయ్య తయారయ్యాడు.

"మీరుండండ్రి బాబూ. దగ్గరనే..." అంటూ గోపి చెయ్యిపట్టి లాక్కెళ్లాడు. అరగంటలో నాలుగు కుండల నీళ్లు మోసుకొచ్చారు.

"సార్! చావు కాడికి తెచ్చిన కుండల్ని మల్లా తీస్కపోతే మా అమ్మ కొడ్తది. వీటి ధర కూడా ఇయ్యాలె సార్" గోపి గొంతులో వణుకు. పాపం! పసివాడు. అరబోసిన అమాయకత్వంతో మొహం నీతిశాస్త్రంలా కనబడింది.

నాలుగు కుండల నీళ్లతో ఐదుగురి స్నానాలైనాయి. వంద రూపాయల నోటు గోపి చేతిలో ఉంచి తడిబట్టలతో బయలుదేరాం. ఇంటికొచ్చేసరికి అవే పొడిబట్టలైనాయి. దీపం వెలిగించి అమ్మమ్మ ఫోటో ముందు ఉంచింది అత్తయ్య. అంతా దండం బెట్టాము. అప్పుడు గుర్తుకొచ్చింది, ఆకలి దంచేస్తోందని. ఏపాటు తప్పినా సాపాటు తప్పదుగదా.

"బాబూ!" చేతులు కట్టుకుని నా ముందు కొచ్చాడు సీతయ్య "అన్నం వండుతా. ఏం కూర చేయ్యాలె?"

"ఊహూఁ! ఐదు నిముషాలు గూడా ఆగ లేము. పదండి హోటల్‌కెళ్లి భోంచేసొద్దాం" ప్రతిపాదించాము.

"బాగా అలసిపోయింద్రుగదా. ఈ ఎండల మీరంతా ఎందుకయా? నేనే పార్సల్ పట్టుకొస్తా" అన్నాడు సీతయ్య.

"అదే సయం. ఇదో డబ్బులు." మావయ్య మనీ పర్సు హుషారుగా తెరుచుకుంది. పావుగంటలో అన్నం పాకెట్లతో తిరిగొచ్చాడు.

అత్తయ్య, మావయ్యా, నేను ఆవురావురు మంటూ భోంచేశాము.. తడికళ్లను కొంగుతో అద్దుకుంటూ అమ్మ మెతుకుల్ని కెలుకుతోంది. సీతయ్య చూపులు అమ్మమ్మ ఫోటో మీదున్నాయి. "నిన్నటి దాకా మా జానకమ్మ చేతివంట తిన్నాను." ఫోటోకు అన్నం చూపించాడు, "అమ్మా, జానకమ్మా! నన్ను గూడా తీసుకో తల్లీ!"

అతని ఆవేదన మా అంతరాళాలను అదిలించింది.

"అట్లంటే ఎట్లా? చావుపుట్టుకలు మనచేతిలో ఉన్నాయా?" తువ్వాలుతో అతని కళ్లు అద్దాడు మావయ్య, అత్తయ్య గూడ మావయ్యకు తోడై సీతయ్యా నోదార్చి సహధర్మచారిణి అనిపించుకుంది.

ఆరోజు అలా గడిచింది. రెండోరోజు భారంగా గడిచింది. ఇంటిలో ఉన్న బోరుబావిలోంచి నీరు సరిగా రావడంలేదు. ఒక్కో గంటకు రెండేసి నిమిషాలపాటు నీరు అందిస్తుంది.

మూడోరోజు మాకంటే ముందే లేచి మమ్మల్ని నిద్రలేపాడు సీతయ్య. తెల్లవారేలోగా స్మశానం చేరుకున్నాము.

ధర్మాత్ముని మనసులా ఆకాశం నిర్మలంగా ఉంది. తూరుపుదిశ కాషాయవర్ణం పులుముకుంటోంది. పాతాళం లోంచి పైకి చొచ్చుకొస్తున్న నును లేత సూర్యకిరణాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. శ్మశాసం నిండా వెండి అలికినట్టుంది. అందరికంటే ముందు శ్మశానంలో ప్రవేశించాడు సీతయ్య. మావయ్య అతన్ననుసరించాడు.

మమ్ముల్ని అల్లారుముద్దుగా చూస్తూ అగ్నిలో బూడిదైన అమ్మమ్మ అస్తికలేరడం పూర్తయింది. ఇంటికి రాగానే "వాళ్లంతా మీతో మాట్లాడ్తమన్నరు బాబూ!" అన్నాడు సీతయ్య. తిరిగి వెళ్లేందుకు తయారవుతున్న మాలో ఆశ్చర్యం అనుమానం, సీతయ్య పంచాయితీ పెడుతున్నాడేమో!

"వాళ్లంటే... ఎవరూ?" మావయ్య భృకుటి వంకలు తిరిగింది.

"జానకమ్మతో రోజూ మాట్లాడే పెద్దమనుషులయ్యా"

'సరే... త్వరగా రమ్మను'

ఐదారుగురిని వెంటబెట్టుకొచ్చాడు సీతయ్య. అంతా కలిసి కూచున్నాము. అందులో ఒకాయన న్యాయవాదిగా పరిచయమయ్యాడు. సీతయ్య అందించిన చాయ తాగామంతా.

"సార్! ఇక్కడి ఆస్తుల గురించి జానకమ్మ విల్లు రాశారు. కానీ... సీతయ్య గురించి మీరేమి ఆలోచించారు?" అపలు సంగతి బయటపడింది లాయర్ నోటినుండి.

మావయ్య, నేను మొహాలు చూసుకున్నాము. అమ్మ, అత్తయ్యలు ముక్కుమీద వేలేసుకున్నారు.

నిజమే.... అతని గురించి మేమెందుకాలోచించలేదు? నాకు సిగ్గనిపించింది.

"ఏమీ ఆలోచించలేదు." తడుముకోకుండా చెబుతున్నాడు మావయ్య. "ఈసారి వచ్చినప్పుడాలోచిద్దాం. అంతవరదాకా అతడీ ఇంట్లోనే ఉంటాడు సరేగాని.... మా అమ్మ విల్లులో ఏం రాసిందో చెప్పండి."

"ఈ ఇల్లు - పొలాన్ని అనాథశరణాలయానికి రాశారు. " విల్లు కాపీ మావయ్య కందించాడు లాయర్.

"ఈ ఊళ్లో అనాథశరణాలయముందా?" కాయితాలు తిరగేస్తూ అడిగాడు.

"ఇప్పటిదాకా లేదు" ఓ పెద్దమనిషి అందుకున్నాడు. "ఇప్పుడు ప్రారంభిస్తాము. జానకమ్మ బతికుంటే ఆ తల్లి చేతులమీదుగా ఈరోజు ప్రారంభ మయ్యేది."

చికాకు పులుముకున్న మావయ్య మొహం శుభ్రజ్యోత్స్నలా వెలిగింది. మూలిక వాసన చూసిన పాము పడగలా ఫోటోవైపు తిరిగి నమస్కరించాడు.

"అయితే సీతయ్యను ఇప్పుడే నావెంట తీసుకెళ్తాను మాతోనే ఉంటాడు" అమ్మవైపు చూస్తూ అనేశాను. "ఏం సీతయ్యా వెళ్తావా?" లాయర్ అడిగాడు.

"ఎల్లనయ్యా, నేనెటూ పోను" అమ్మమ్మ ఫోటో వైపు అదేపనిగా చూస్తూ అనేశాడు. కళ్లనిండా కృతజ్ఞత ఉంది.

"మరి నీ శేషజీవతమెట్లా సీతయ్యా? అమ్మ చొరవ తీసుకుంది. "మా అమ్మ జానకి అవుతే నువు హన్మంతుడిలా ఉండేవాడిని. నమ్మినబంటువు. నువ్వంటే మాకెంతో గౌరవం." అంటూంటే అమ్మ కనురెప్పలు మంచు కురిసిన పూరేకులైనాయి.

"దండాలమ్మా!" సీతయ్య మనోసాగర ముప్పొంగినట్టుంది. ఆ పొంగుఛాయలు కళ్లల్లో కనబడుతున్నాయి. అమ్మమ్మ ఫోటో వైపు చేతులు జోడించాడు. "ఆయమ్మకు తగిన బిడ్డవమ్మా. నేను దిక్కులేనోణ్ణి. దిక్కులేని పిల్లగాండ్లకు సేవ జేసుకుంట ఇక్కడనే ఉంట. మాయమ్మ, జానకమ్మ ఇక్కడనే దేవతై పోయింది గదా! ఆయమ్మ ఈ ఇంట్ల ఇంకా తిరుగుతున్నట్టే అన్పిస్తుంది. ఆమెకు దండం బెట్టుకుంట ఈ ఇంట్లోనే ఉంట. దిక్కులేని పిల్లలతోని అడుకుంటా. ఆపిల్లల నడుమ నేను గూడా పిల్లగాన్నైపోతా...." తన్మయంగా చెబుతున్నాడు. నాకెదురుగా అమృతమూర్తి అమ్మమ్మ ఫోటో. ఫోటోకు, నా కళ్లను కమ్ముకున్న మంచుతెరలకు మధ్య సీతయ్య... నా కన్నీళ్లతో అతని పాదాలు కడగాలన్పిస్తోంది.

**జాగృతి జూన్ 21, 2004**

* * * * *

